క్లుప్తంగా

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి



తిరువూరు: అగ్రిగోల్డ్‌లో పొదుపు చేసిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏజెంట్లు, కష్టమర్ల అసోసియేషన్ సభ్యులు తిరువూరులో శుక్రవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. స్థానిక దారా టౌన్‌షిప్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన ప్రజా దర్బార్‌లో తమ ఇబ్బందులను ఏజెంట్లు, ఖాతాదారులు వివరించారు. పలువురు యువతీ, యువకులు తమకు ఉద్యోగాలు ఇప్పించాలని, పెన్షన్లు, ఆర్థికసాయం కోరుతూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో పలు శాఖల ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు.

రైతుబజారు స్టాల్స్ తనిఖీ



తిరువూరు: స్థానిక చీరాల సెంటర్‌లోని రైతుబజారు స్టాల్స్‌ను శుక్రవారం జిల్లా మార్కెటింగ్ అధికారి మంగమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా లైసెన్సులు జారీ చేసిన వారు మాత్రమే రైతు బజారులో స్టాల్స్ నిర్వహించాలని, ప్రైవేటు వ్యక్తులను అనుమతించే ప్రసక్తే లేదని అన్నారు. నిర్ణీత ధరలకు మాత్రమే కూరగాయలు విక్రయించాలని, స్టాల్స్ ఎదుట ధరల పట్టిక, స్టాకు వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. రైతుబజారు సీఈఓ చిట్టిబాబు పాల్గొన్నారు.

అన్నదానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి లయన్స్ క్లబ్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఆధ్వర్యంలో కొండపల్లిలోని శ్రీ విద్యా దివ్యాంగుల అనాథ ఆశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు. చిన్నారుల సామూహిక జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. లయన్ జి.రామిరెడ్డి దాతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు, అనాథ ఆశ్రమాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఎ.నాగిరెడ్డి, దొప్పల బుజ్జిబాబు, కిషోర్‌బాబు, సంస్థ కార్యదర్శి బండి అమల తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చాట్రాయి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని పలు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పోలవరం, చిన్నంపేట, చాట్రాయి గ్రామాల్లోని డ్రెయినేజీల్లో పూడికతీత, నిల్వ నీటి తొలగింపు, రోడ్ల పక్కన చెత్త, ముళ్ల పొదలు తొలగింపు వంటి పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లారు. చాట్రాయి గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన జేసీబీతో ముళ్ల పొదలను తొలగించి, మెయిన్ రోడ్డు నుంచి అడవిలోకి వెళ్లే వ్యవసాయ డొంక రోడ్డును రైతుల సహకారంతో బాగు చేశారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



పీజే విజయ్‌కుమార్

నూజివీడు: మండలంలోని రామన్నగూడేనికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పీజే విజయ్‌కుమార్ (55) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన ముసునూరు మండలం వేల్పుచర్లలోని ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయనకు ఇటీవల ప్రమాదం జరిగి కాలుకి దెబ్బ తగలడంతో చికిత్స పొందుతూ ఇంటి వద్దే ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో నూజివీడులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మృతిచెందారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న యూటీఎఫ్ నాయకులు బొద్దుకోళ్ల బాబూరావు, జి.వెంకటేశ్వరరావు, మల్లెల చెన్నారావు, పలువురు ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రతిపాదనలకే పరిమితం

- 120 ఏళ్ల కిందట నిర్మించిన శివాలయం
- ప్రారంభం కాని ఆలయ పునర్నిర్మాణ పనులు
- వర్షాకాలంలో గర్భగుడిలోకి చేరుతున్న నీరు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూపులు



తిరువూరు రామలింగేశ్వరాలయం

తిరువూరు: సుమారు 120 సంవత్సరాల కిందట నిర్మించిన తిరువూరు బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ రామలింగేశ్వరాలయ పునర్నిర్మాణ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రధాన రహదారి కంటే లోతట్టులో ఉన్న ఈ ఆలయంలోకి వర్షాకాలంలో డ్రెయినేజీ నీరు, వర్షం నీరు చేరి భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. 1904 సంవత్సరంలో వారణాశి నుంచి శివలింగంతో కాలినడకన వచ్చిన అచ్చమ్మ అనే వృద్ధురాలు ఈ ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయాన్ని పునర్నిర్మించాలని గతంలో పాలకవర్గం నిర్ణయించినప్పటికీ ఎన్నికలు సమీపించడంతో ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు.

ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా

రామలింగేశ్వరాలయానికి తిరువూరు ప్రధాన రహదారిలో దుకాణ సముదాయం ఉంది. ఇందులో 19 దుకాణాలుండగా, ఆదాయం నామమాత్రంగా వస్తోంది. దేవదాయ శాఖ ఈ దుకాణాల అద్దెలను 30 శాతం పెంచుతూ ఆదేశాలిచ్చినప్పటికీ అమలులో జాప్యం జరుగుతోంది. ఆలయ పునర్నిర్మాణానికి దాతల నుంచి విరాళాల సేకరణతో పాటు ఆలయ ఆదాయం నుంచి ఖర్చు పెట్టే అవకాశం ఉన్నా తదనుగుణంగా అధికారులు ప్రయత్నించట్లేదని భక్తులు విమర్శిస్తున్నారు.

పునర్నిర్మాణానికి మీనమేషాలు

తిరువూరు పట్టణంలోని అతి పురాతనమైన రామలింగేశ్వరాలయాన్ని పునర్నిర్మించాలని గతంలోనే పలుమార్లు ప్రయత్నించినా ఆచరణలోకి రావట్లేదు. పలువురు దాతలు విరాళాలు అందజేసేందుకు ముందుకు వస్తున్నందున దేవదాయ శాఖ త్వరితగతిన పనులు ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

రామలింగేశ్వరస్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతి లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఆదాయం పెంపునకు కూడా చర్యలు తీసుకుంటున్నాం. దుకాణదారుల నుంచి 30 శాతం అద్దెల పెంపునకు కూడా దేవదాయ శాఖ అనుమతి లభించింది.

– జన్ను వెంకటేశ్వరరావు, మేనేజర్, తిరువూరు గ్రూపు ఆలయాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం



బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, అధ్యాపకులు

మైలవరం: మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థుల సమక్షంలో శుక్రవారం అడ్మిషన్ల బ్రోచర్‌ను విడుదల చేసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ హానర్స్, ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ హానర్స్, లాజిస్టిక్స్, బీఎస్సీ హానర్స్, బోటనీ, కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ డేటా సైన్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తమ కళాశాలలో డిజిటల్ లైబ్రరీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యూత్ రెడ్‌క్రాస్, డిజిటల్ ఆడిటోరియం, జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్, ఓపెన్ జిమ్, స్మార్ట్ క్లాస్ రూమ్స్, కెరీర్ గైడెన్స్ సెల్, ఆన్‌లైన్ సౌకర్యం, అతి తక్కువ ఫీజులు, స్కాలర్‌షిప్స్ సౌకర్యం ఉందని వివరించారు. ఇతర వివరాలకు ఫోన్: 08659–299992 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబా ఆలయ వార్షికోత్సవం



ఆగిరిపల్లి: స్థానిక సింగన్నగూడెం బస్ స్టాప్ వద్ద ఉన్న సర్వకార్య సిద్ధి షిర్డీ సాయి బాబా ధ్యాన మందిరంలో 17వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబా వారికి కాకడ హారతి, సర్వనామ సంకీర్తన కార్యక్రమాలను సాయి బాబా భక్త బృందం సభ్యులు నిర్వహించారు. సాయి బాబాకు విశేష ఫలామృతాలతో అభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన, పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు దేవులపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయంలో సర్వ కార్యసిద్ధి షిర్డీ సాయిబాబా ట్రస్ట్, భక్తుల ఆధ్వర్యంలో 4 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

ఒకటో తేదీనే విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు అందించాలి



మాట్లాడుతున్న సంఘ ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ

నూజివీడు: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశాన్ని అధ్యక్షులు బీఎం సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. విశ్రాంత ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ల నగదును వారి ఖాతాలకు జమ చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని, ఈ లోపు ఐఆర్ మంజూరు చేయాలని, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత ట్రీట్‌మెంట్ హెల్త్ స్కీంను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ, సభ్యులు పలగాని పిచ్చయ్య, పర్వతనేని మాధవరావు, స్టాన్లీ ప్రభాకర్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయం భూముల పరిశీలన



విస్సన్నపేట: స్థానిక గంగా పార్వతి సమేత చంద్రశేఖరస్వామి దేవాలయం(శివాలయం) భూములను దేవదాయ శాఖ డెప్యూటీ కలెక్టర్ కృష్ణకుమారి, సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఆలయ ఈఓ సీతారామయ్య పాల్గొన్నారు.

విజయదుర్గా ఆలయంలో చండీ హోమం



చండీ హోమంలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం చండీ హోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం, అమావాస్య నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమం నిర్వహించారు. తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి విశేష అలంకరణ , పూజలను ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. అనంతరం యాగశాలలో చండీహోమం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో హోమం జరిపించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

లారీ డ్రైవర్‌కు జైలు

నూజివీడు: లారీని అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు 15 రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2020 అక్టోబర్ 2వ తేదీన సీతానగర్‌కు చెందిన బాణావతు రమేష్, జరుపుల త్రిమూర్తులు ద్విచక్ర వాహనంపై విస్సన్నపేట నుంచి నూజివీడు వైపునకు వస్తుండగా ఎదురుగా అతి వేగంగా వచ్చిన లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిలో బాణావతు రమేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై నూజివీడు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి లారీ డ్రైవర్‌పై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం డ్రైవర్‌కు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లను అందిస్తున్న హేమవతి రాజ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మహిళలు తమ అభివృద్ధికి వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని టప్పర్ వేర్ డిస్ట్రిబ్యూటర్ ఆఫ్ ఏపీఎండీటీ హేమవతి రాజ్యలక్ష్మి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత స్కూటీ ట్రైనింగ్ క్యాంపు ముగింపు సందర్భంగా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన హేమవతి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఆ క్రమంలో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు సమాజంలో ముందుకు సాగాలని చెప్పారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం తమ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ విభాగం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు టి. విజయలక్ష్మి, సెంటర్ కన్వీనర్ వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు):విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందేలా ఉపాధ్యాయులు చూడాలని ఎంఈఓ పాల్ కెనడీ సూచించారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని ఏహెచ్‌యూపీ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసిన భోజనాన్ని అందించాలన్నారు. ముఖ్యంగా సులభరీతిలో అర్థమయ్యేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయటంతోపాటు సమయపాలన పాటించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఆదమరిస్తే ..అంతే!



పోతవరప్పాడు సమీపంలోని మలుపు



నెక్కలం గొల్లగూడెం-అడవినెక్కలం వద్ద ప్రమాదకర మలుపు

మండలంలోని పలు రహదారుల్లో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారి ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి. ఆగిరిపల్లి–విజయవాడకు నిత్యం వందలాది మంది వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. పోతవరప్పాడు, అడవినెక్కలం వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి. అక్కడ ఎటువంటి ప్రమాద సూచికలు కానీ, వేగ నియంత్రణ బోర్డులు కానీ లేవు. దీంతో నిత్యం ఆయా మలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుని అనేకమంది గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. –ఆగిరిపల్లి

భౌభౌలతో బెంబేలు

- గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడులు
- గ్రామస్తుల ఆందోళన



మైలవరం బస్‌స్టాండ్ సమీపంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

మైలవరం: గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇవి గుంపులుగుంపులుగా వీధుల్లో సంచరిస్తూ గ్రామస్తులపై దాడులు చేస్తున్నాయి. వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు తదితర గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య బాగా పెరిగిపోయింది. రోడ్లపై సంచరిస్తూ వచ్చే పోయే వారిని కరుస్తున్నాయి. ఇళ్ల వద్ద ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇంట్లోకి చొరబడి ఆహార పదార్థాలను తినేస్తున్నాయి. వృద్ధులు, మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. పెద్దల తోడు లేకుండా చిన్నారులు పాఠశాలలకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఆయా పంచాయతీ అధికారులు కుక్కలు పట్టే వారిని ఏర్పాటు చేసి వీధి కుక్కలను పట్టించి మైలవరం మండలం పొందుగల సమీపంలోని పంగిడి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేవారు. ప్రస్తుతం పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. కుక్కలను పట్టించి గర్భ నిరోధక ఇంజక్షన్లు అయినా ఇస్తే కొంత వరకు వాటి సంఖ్యను నిర్మూలించే అవకాశం ఉంటుందని పశు సంవర్ధక శాఖాధికారులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కృష్ణా జలాలు సరఫరా చేయాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, బాధితులు

ఎ.కొండూరు: మండలంలోని చైతన్యనగర్ తండాకు నిలిచిపోయిన కృష్ణా జలాలను వెంటనే సరఫరా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి. ఆనందరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జట్టి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు, కిడ్నీ బాధితులతో కలిసి శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా కృష్ణా జలాల సరఫరా నిలిచిపోవడంతో మండలంలోని గిరిజనులు, కిడ్నీ బాధితులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కృష్ణా జలాలు రాకపోవడంతో బోరు నీళ్లు తాగుతున్నారని, దీంతో నడుము, కీళ్ల నొప్పులు అధికమై ప్రజలు బాధపడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కృష్ణా జలాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు జమలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్ నాయక్, సోనిక, నగేష్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ధర్నా



తిరువూరులో ధర్నా చేస్తున్న కార్మికులు

తిరువూరు: అసంఘటిత కార్మికుల సంక్షేమానికి గతంలో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తిరువూరు ప్రభుత్వాస్పత్రి సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. 2020లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కార్మిక చట్టాల అమలును నిలిపివేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వంట ఏజెన్సీలు, ఆరోగ్య, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, ఆయుష్, 108, 104 తదితర పథకాల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాత కార్మిక చట్టాల అమలు కోసం పట్టణ, మండల కేంద్రాల్లో ఈ నెల 10న జరుగనున్న ధర్నా, ప్రదర్శనల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం ఈనెల 10న జరుగనున్న ధర్నాకు సంబంధించి ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. సీఐటీయూ నాయకులు బి. వెంకటేశ్వరరావు, సురేష్, నాగరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం



చిన్నారి ధన్విత తండ్రి ప్రసాద్‌కు సాయం అందిస్తున్న గోవిందరాజులు



పసికందు వైద్యానికి సాయం అందచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్స్ నాగబాబు, రమణా నాయక్

భవానీపురం(విజయవాడపశ్చిమ):అనారోగ్యంతో బాధపడుతూ హాస్పటల్స్‌లో చికిత్స పొందుతున్న ఇద్దరు చిన్నారుల వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ తమ వంతుగా ఆర్థిక సాయాన్ని అందచేశారు. విజయవాడ మధురానగర్‌కు చెందిన ప్రసాద్, సునీత దంపతుల మూడు సంవత్సరాల కుమార్తె ధన్విత బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. తమ కూతురు ప్రాణాలను కాపాడేందుకు ఆ పేద దంపతులు ఇప్పటికే తాహతుకు మించి ఖర్చు చేశారు. ఈ క్రమంలో వారు దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించగా విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.15 వేలు ఆర్థిక సహాయంగా అందచేశారు. హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పటల్‌లో చిన్నారి ధన్విత చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు సాయిరాం ప్లాస్టిక్స్ గోవిందరాజులు అక్కడికి వెళ్లి తండ్రి ప్రసాద్‌కు నగదు అందచేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం దీవెన ఫౌండేషన్ సంస్థ సామాజిక బాధ్యతగా భావిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పది రోజుల పసికందు వైద్యానికి..

విజయవాడ సత్యనారాయణపురం రామకోటి మైదానం దగ్గర నివసించే మహాలక్ష్మి, తేజ దంపతులు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు పది రోజుల క్రితం వారికి జన్మించిన చిన్నారి బ్లడ్ ఇన్ఫెక్షన్ హైపోథెర్మియా వ్యాధితో బాధపడుతుంది. ఇంట్లో లక్ష్మి పుట్టిందని సంతోషపడుతున్న ఆ పేద దంపతులకు చిన్నారికి కలిగిన అనారోగ్యం హతాశులను చేసింది. పని చేస్తేనే కుటుంబం గడవని పరిస్థితుల్లో కూడా తమ చేతనైనంత వరకు ఖర్చు చేసి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో సహాయం కోసం దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరుపున రూ.10 వేలు నగదును గ్రూప్ సభ్యులు హెడ్‌కానిస్టేబుల్ నాగబాబు, రమణా నాయక్‌లు చిన్నారి చికిత్స పొందుతున్న హాస్పటల్‌కు వెళ్లి అందచేశారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

గంపలగూడెం: 2003 డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షేక్ నవాబ్‌జానీ ప్రభుత్వాన్ని కోరారు. పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో కనీస అవసరాలకు మెయింటెనెన్స్ గ్రాంటు విడుదల చేయాలని, జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, ఇప్పటికే బకాయి ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్, పార్ట్ పేమెంట్, సరండర్ లీవ్ బిల్లులను ఎప్పటికప్పుడు క్లియరెన్స్ చేసి వారి అకౌంట్లలో జమ చేయాలని, తక్కువ వేతనంతో దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి వారి సొంత మండలాలకు బదిలీ చేయాలని నవాబ్ జానీ కోరారు. జిల్లా కార్యదర్శి కోసూరి రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోలా రాఘవరాజు, జయశీలన్‌రావు, సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

● ముసునూరు: మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా తయారు చేసి, పిల్లలకు అందించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బా రావు ఆదేశించారు. మండలంలోని గోపవరం హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచి, నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజన నిర్వహణా రికార్డులను తనిఖీ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com